క్లుప్తంగా

ఎరువుల దుకాణాల తనిఖీ



గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను సోమవారం తనిఖీ చేసినట్లు ఏవో రాజలింగం తెలిపారు. ఆయా దుకాణాల్లో ఎరువుల బస్తాల నిలువలు, పురుగు మందుల రికార్డులను పరిశీలించారు. వ్యాపారుల వద్ద నిలువ ఉన్న యూరియా బస్తాలను అధార్ కార్డు, పట్టా పాస్ బుక్కులు జిరాక్స్‌ల ఆధారంగా ఒక్కో రైతుకు రెండు యూరియా బస్తాల చొప్పున ఇప్పించినట్లు తెలిపారు. రైతులకు సరిపడా యూరియా వస్తుందని ఎవరూ ఆందోళన చెందొద్దని ఏవో రైతులకు సూచించారు.

చెరువు కట్ట పరిశీలన



తాడ్వాయి(ఎల్లారెడ్డి): నందివాడ గ్రామ శివారులో గల చెరువు కట్టను సోమవారం తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువులోకి నీరు వచ్చి చేరింది. దీంతో కట్ట బలహీనపడటంతో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులు, రైతులకు సూచించారు. వారి వెంట జీపీ సిబ్బంది, గ్రామపెద్దలు, రైతులు ఉన్నారు.

మన పాఠశాల-మన ఆత్మగౌరవం



భిక్కనూరు: తిప్పాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ప్రాథమిక పాఠశాలలో తపస్ ఆధ్వర్యంలో మన పాఠశాల-మన ఆత్మగౌరవం ప్రతిజ్ఞ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తపస్ జిల్లా అధ్యక్షుడు పుల్గం రాఘవరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠశాలను ఒక దేవాలయంగా భావించి ముందుకు వెళ్లాలన్నారు. పాఠశాల ఆస్తులను పరిరక్షిస్తూ సామాజిక స్పృహ కలిగి ఉండాలని సూచించారు. దేవాలయ పరిరక్షకుడిగా ఉంటామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. హెచ్ఎం యాదగిరి, ఉపాధ్యాయులు విష్ణుప్రియ, వాణిశ్రీ, ఉమారాణి, సురేష్, అజ్జు తదితరులు పాల్గొన్నారు.

ఐపీపీబీ వ్యవస్థాపక దినోత్సవం



కామారెడ్డి అర్బన్: ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ) 8వ వ్యవస్థాపక సంబరాలు సోమవారం స్థానిక హెడ్ పోస్టాఫీసులో ఘనంగా నిర్వహించారు. కామారెడ్డి బ్రాంచి మేనేజర్ కవిత, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సుజిత్, అభిమన్యు, పోస్ట్‌మాస్టర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు. బ్యాంకుల్లో అందే అన్ని సేవలు ఇండియన్ పేమెంట్స్ బ్యాంక్‌లో ఉన్నాయని.. ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

సీసీకి సన్మానం



భిక్కనూరు: మండల మహిళ సమాఖ్య సీసీగా బదిలీపై వచ్చిన గంగళ్ల జయశ్రీని సోమవారం మండల సీసీలు సోమవారం సన్మానించారు. బస్వాపూర్‌లో సీసీగా పనిచేస్తున్న జయశ్రీని అధికారులు భిక్కనూరు సీసీగా నియమించారు. దీంతో జయశ్రీ భిక్కనూరు సీసీగా సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జయశ్రీ మాట్లాడుతూ.. మహిళ సమాఖ్యను మరింత అభివృద్ధి చేస్తానన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం నిధులు విడుదల

కామారెడ్డి టౌన్: కామారెడ్డి వరద బాధిత కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం కింద ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి సీతక్కతో పాటు తాను ప్రభుత్వానికి ఇచ్చిన నివేదిక ఆధారంగా నిధులు మంజూరయ్యాయన్నారు. జిల్లా కేంద్రంలోని జీఆర్ కాలనీలో 45, కౌండిన్య కాలనీలో 22 కుటుంబాలకు రూ.11,500 వారి బ్యాంక్ ఖాతా అకౌంట్‌లో జమ చేయనున్నట్లు తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంలో ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్న 67 మందికి, నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో 60 కుటుంబాలకు రూ.4 వేల చొప్పున వారి ఖాతాలో జమ చేస్తామన్నారు.



బాన్సువాడ పట్టణంలోని కల్కి చెరువు మత్తడి కాలువ ఇది. ఇది పూర్తిగా కబ్జాకు గురైంది. పంట పొలాలకు సాగునీరందించే ఈ కాలువ ఆనవాళ్లు కోల్పోయింది. కాలువకు ఇరువైపులా స్థలాలు రూ.కోట్ల విలువ పలకడంతో రియల్టర్లు, వ్యాపారులు కలిసి కాలువ భూమిని కబ్జా చేసినట్లు స్థానికులు చెబుతున్నారు.



ఈ కాలువ హెచ్‌పీ పెట్రోల్ బంకు ముందు వెళ్లే మత్తడి కాలువ. ఈ కాలువ పక్కన భూమి ఉన్న కొందరు ఆ కాలువపై నిర్మాణాలు చేసి కబ్జా చేశారు. రెండు కిలోమీటర్ల దూరం ప్రవహించే ఈ మత్తడి కాలువ వాగు పక్క నుంచే వెళ్లి పట్టణం చివరన ఉన్న పంట పొలాలకు సాగునీరందిస్తుంది. సంబంధిత శాఖల అధికారులకు తెలిసినా కూడా కాలువ స్థలాన్ని ఆధీనంలోకి తీసుకోకపోవడం గమనర్హం.

వరద పోయే దారేది?

- కబ్జా కోరల్లో కల్కి చెరువు కాల్వలు
- జలవనరులనూ వదలని కబ్జాదారులు
- పరాధీనంలో రూ.కోట్ల విలువైన ఆస్తులు
- పట్టించుకోని మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు



కాలువల కబ్జాతో బాన్సువాడ పట్టణంలో ఎన్జీవోస్ కాలనీలోకి వచ్చిన వరద నీరు

బాన్సువాడ : కబ్జాకు కాదేది అనర్హం అంటున్నారు అక్రమార్కులు. అధికారుల పట్టింపులేనితనం అక్రమార్కులకు కలిసొస్తుంది. బాన్సువాడలో నిబంధనలను అతిక్రమించి మత్తడి కాల్వలు కబ్జాకు గురయ్యాయి. పట్టణ నడిబొడ్డున పారే చెరువుల మత్తడి (వ్యవసాయ) కాలువలు పరాధీనమయ్యాయి. సంబంధిత శాఖలు అటువైపు చూడకపోవడంతో చెరువు కాలువలు జీవం కోల్పోయే పరిస్థితి తలెత్తింది. బాన్సువాడలో ఏళ్ల తరబడి చెరువుల కాల్వలు(నాలాలు) దురాక్రమణ పాలవుతున్నాయి. పూర్వీకులు వ్యవసాయం కోసం బాన్సువాడకు ఉత్తరం దిశకు కల్కి చెరువును నిర్మించారు. ఈ చెరువు కింద సుమారు 487 ఎకరాల ఆయకట్టు ఉంది. వర్షాలతో ఈ చెరువు నిండాక ఎల్లయ్య చెరువు, నాగిరెడ్డి చెరువులతో పాటు ఊరు కింద వ్యవసాయ భూములకు సాగునీరందించేందుకు కాల్వలు తవ్వారు. ఈ కాల్వలు నీటిపారుదల, మున్సిపల్ శాఖల ఆధీనంలో ఉన్నాయి. రోజురోజుకు పట్టణం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో గ్రామ పంచాయతీగా ఉన్న బాన్సువాడ నేడు మున్సిపల్ స్థాయికి ఎదిగింది. అయితే ఈ కాల్వలు పట్టణం నడి బొడ్డు నుంచి తవ్వడంతో కొందరు నివాస గృహాల కోసం, మరి కొందరు వ్యాపార సముదాయాల కోసం, మరి కొందరు రియల్ ఎస్టేట్ కోసం కాల్వలను కబ్జా చేశారు. కల్కి చెరువు కింద పట్టణంలో ఎన్జీవోఎస్ కాలనీ, సాయికృపానగర్, చైతన్య కాలనీ, శ్రీరామకాలనీ, టీచర్స్ కాలనీలు వెలిశాయి. వ్యవసాయ భూముల్లో భవనాలు, దుకాణ సముదాయాలు నిర్మాణాలు చేపట్టారు. దీంతో కల్కి చెరువు సాగు విస్తీర్ణం సైతం గణనీయంగా తగ్గింది. కాల్వల కబ్జాల వల్ల వర్షాకాలంలో చెరువు నుంచి వచ్చే నీరు కాల్వల్లోకి కాకుండా రోడ్లపైకి, కాలనీల్లోకి వస్తున్నాయి. ఎండాకాలంలో మాత్రం చివరి ఆయకట్టుకు సాగునీరందని పరిస్థితి నెలకొంది.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు..

ఒక్కప్పుడు ఊరి చివరిలో ఉండే కల్కి చెరువు, ఎల్లయ్య చెరువు స్థలాల్లో పట్టణం విస్తరించింది. అవి లోతట్టు ప్రాంతాలు కావడంతో సాధారణ వర్షాలకే వరద పోటెత్తుతోంది. పై నుంచి వచ్చే వరద నీరు ఆయా ప్రాంతాల్లో నిలువకుండా వరద కాల్వలు లేకపోవడంతో వర్షాకాలంలో ముంపునకు గురవుతున్నాయి. కాల్వలకు ఇరువైపులా 12 ఫీట్ల దూరంలో నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా ఆ మూడు ఫీట్లలోపే నిర్మాణాలు జరుగుతున్నాయని.. వాటికి అనుమతులు ఎలా ఇస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

కోట్లాది రూపాయల ఆస్తులు అన్యాక్రాంతం..

కల్కి చెరువు, ఎల్లయ్య చెరువు మత్తడి కాల్వలు అన్యాక్రాంతమయ్యాయి. వీటి విలువ రూ.కోట్లలో ఉంటుందని రియల్ ఎస్టేట్ వర్గాల అంచనా. ఒక్కో కాలువ 12 ఫీట్ల వెడల్పుతో ఉండాలి. కాల్వకు ఒక పక్క నుంచి కాల్వలను పరిశీలించేందుకు ఇరిగేషన్ సిబ్బంది తిరిగేందుకు వీలుండాలి. ప్రస్తుతం కాల్వలకు ఇరుపక్కల కనీసం కాలినడకన వెళ్లలేని పరిస్థితి ఉంది.

అనుమతులు ఎలా ఇచ్చారో?

బాన్సువాడ గ్రామ పంచాయితీగా ఉన్నప్పుడు విధులు నిర్వహించిన అధికారులు కాల్వల పక్కన చేపట్టే నిర్మాణాలకు ఎలా అనుమతులిచ్చారో తెలియదు. అప్పట్లో చేసిన పొరపాటు వల్లే నేడు సమస్య ఏర్పడుతోంది. తమ శాఖలో ఉన్న జాబితాలో కూడా కొన్ని కాలువలు లేవు. కబ్జాకు గురైన కాలువలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

– గజానంద్, ఏఈ, ఇరిగేషన్, బాన్సువాడ

దెబ్బతిన్న పంటల పరిశీలన



దేమికలాన్‌లో పంటలను పరిశీలిస్తున్న ఏఈవో శ్రావణ్ కుమార్



రామేశ్వర్‌పల్లిలో పంట నష్టం అంచనా వేస్తున్న వ్యవసాయాధికారులు



గోలిలింగాలలో పంటలను పరిశీలిస్తున్న ఏఈవో ప్రశాంత్



లింగంపల్లిలో పంటలను పరిశీలిస్తున్న రాష్ట్రఅపెక్స్ కమిటీ మెంబర్ మామిళ్ల అంజయ్య

సాక్షి నెట్‌వర్క్: భారీ వర్షాల కారణంగా జిల్లాలో దెబ్బతిన్న పంట పొలాలను శుక్రవారం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం వివరాలు నమోదు చేసుకున్నారు. అలాగే రైతులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. పంటలను పరిశీలించడానికి వచ్చిన అధికారులు, ప్రజాప్రతినిధుల వద్ద రైతులు తమ బాధలు చెప్పుకున్నారు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చూస్తామని వారు హామీ ఇచ్చారు.

ఉద్యోగులకు పాత పెన్షన్ అమలు చేయాలి



మద్నూర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న తహసీల్దార్, సిబ్బంది



ఎల్లారెడ్డి నుంచి హైదరాబాద్‌కు తరలివెళ్తున్న ఉపాధ్యాయులు

సాక్షి నెట్‌వర్క్: పాత పెన్షన్ అమలు చేయాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులు సోమవారం నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ..పాత పెన్షన్ విధానంతో ఉద్యోగులకు భద్రత ఉండేదని, సీపీఎస్ వల్ల ఉద్యోగులకు వారి కుటుంబాలకు భరోసా లేకుండా పోయిందన్నారు. 2004 తర్వాత చేరిన ఉద్యోగులు సీపీఎస్ కిందకి తీసుకువచ్చారని పేర్కొన్నారు. రిటైర్డ్ ఉద్యోగి మరణించినా 40 శాతం నగదును కూడా ప్రభుత్వాలు ఇవ్వలేకపోవడం అన్యాయమన్నారు. ఉద్యోగి పెన్షన్ మొత్తం షేర్ మార్కెట్ ఒడిదుడుకులపై ఆధారపడి ఉండటం విచారకరమన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ అసెంబ్లీ సమావేశాల్లో ఓపీఎస్ రద్దు చేస్తూ తీర్మానం చేయాలని కోరారు. పలువురు హైదరాబాద్‌లో చేపట్టే ధర్నాకు తరలి వెళ్లారు.

రోడ్డును కమ్మేసినా కనపడటం లేదా?



మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండల కేంద్రం నుంచి లింబూర్, డోంగ్లీ నుంచి కుర్లా వెళ్లే ప్రధాన రహదారులపై రోడ్డుకు అడ్డంగా పెరిగిపోతున్న ముళ్లపొదలు ఆయా శాఖ అధికారులు, సిబ్బందికి కనపడటం లేదా అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలకు వెళ్లే రహదారులపై అడ్డంగా ముళ్లపోదలు పెరిగి పోవడంతో వాహనదారులు రాత్రివేళల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు అడ్డుగా ఉన్న ముళ్లపొదలను తొలగించాలని కోరుతున్నారు.

లింగారెడ్డిపేటలో యువకుల శ్రమదానం



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిపేటలో సోమవారం యువకులు శ్రమదానం చేశారు. మున్సిపల్ వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్ యువకులతో కలిసి శ్రమదానం చేశారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు యువకులను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. అనంతరం వారిని సన్మానించారు.

నత్తనడకన మరమ్మతులు

- బీబీపేట నుంచి కామారెడ్డికి రాకపోకలు బంద్
- రోడ్డు తెగిపోయి ఆరు రోజులైనా పూర్తికాని పనులు
- నాలుగు జిల్లాలను కలిపే ప్రధాన రహదారి బంద్ కావడంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు



బ్రిడ్జి వద్ద రోడ్డు తెగిపోవడంతో కాలినడకన కూడా ఇబ్బందులు పడుతున్న ప్రజలు

బీబీపేట: భారీ వర్షాల వల్ల తీవ్ర నష్టం వాటిల్లడంతో పాటు రాకపోకలు ఎక్కడికక్కడ స్తంభించిపోయాయి. బీబీపేట పెద్ద చెరువు అలుగు ఉధృతంగా ప్రవహించడంతో ప్రధాన రహదారిపై ఉన్న బ్రిడ్జికి రెండు పక్కల రోడ్డు పూర్తిగా కోతకు గురైంది. అయితే ఇది జరిగి ఆరు రోజులైనా కనీసం మట్టి పనులు, కనీసం కాంక్రీట్ పనులు కానీ కొనసాగడం లేదు. రెండు రోజుల క్రితం పనులు ప్రారంభమైనా ఇప్పటికీ ప్రజలు నడవడానికి కూడా వీలు కావడం లేదు. అంతే కాకుండా జిల్లా కేంద్రంతో పాటు వివిధ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి కావడం, ఇతర జిల్లాలకు వెళ్లే రోడ్డు అయినప్పటికీ పనులు మాత్రం నత్తనడకన కొనసాగిస్తున్నారు. ఆర్టీసీ బస్సులు సైతం కామారెడ్డి నుంచి వచ్చి బ్రిడ్జి వద్ద దించి పోతుండడంతో అక్కడి నుంచి ఊర్లోకి రావడం ఇబ్బందికరంగా మారింది. ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి కూడా సిద్ధం కాకపోవంతో వాహనదారులు పెద్దమల్లారెడ్డి మీదుగా కామారెడ్డికి చేరుకోవాల్సి వస్తోంది. మొరం సమీప అలుగు నుంచి తీస్తున్నప్పటికీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా పనులు నెమ్మదిగా కొనసాగుతున్నాయి. ఆపత్కాలంలో అంబులెన్స్ సైతం పదుల కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. రోడ్డు బంద్ కావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు సత్వరమే చర్యలు తీసుకొని పూర్తి చేయాలని కోరుతున్నారు.

పింఛన్ కోసం పడిగాపులు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని పోస్టాఫీసు వద్ద సోమవారం పింఛన్ లబ్ధిదారులు పాసుబుక్కులు లైనులో పెట్టి చెట్ల కింద పడిగాపులు కాశారు. ఉదయం నుంచి వందల సంఖ్యలో పింఛన్ లబ్ధిదారులు పోస్టాఫీసు కార్యాలయానికి తరలివచ్చారు. ఉదయం 12 గంటలు దాటినా అధికారులు డబ్బులు పంపిణీ చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. డబ్బులు ఆలస్యంగా రావడంతో పోస్టాఫీసు సిబ్బంది సాయంత్రం వరకు డబ్బులు పంపిణీ చేయాల్సివచ్చింది.

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పాఠశాలల్లోని విద్యార్థులు గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన పెంచుకోవాలని షీటీం కానిస్టేబుళ్లు సుప్రజ, శ్రీశైలం సూచించారు. జప్తిజాన్కంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు వారు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళల, పిల్లల భద్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రోడ్డు భద్రత, సైబర్ క్రైమ్ గురించి వారు క్షుణ్ణంగా తెలియజేశారు. హెచ్ఎం అనసూయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బంజారా ఉద్యోగుల జిల్లా కమిటీ ఎన్నిక



మోతీరాం నాయక్ (అధ్యక్షుడు)



శంబ్యానాయక్ (ప్రధాన కార్యదర్శి)



మద్నూర్‌లో ఎన్నికైన సభ్యులు

బాన్సువాడ: ఆలిండియా బంజార సేవ సంఘ్ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కమిటీని సోమవారం బాన్సువాడలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మోతీరాం నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా శంబ్యానాయక్‌లతో పాటు జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నుకున్న కమిటీని ఆల్ఇండియా బంజార సేవ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మోహన్‌నాయక్ ఘనంగా సన్మానించారు.

విశ్రాంత ఉద్యోగుల నూతన సంఘం ఎన్నిక

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని పెన్షనర్ల భవనంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల నూతన సంఘం ఎన్నిక సోమవారం జరిగింది. విశ్రాంత ఉద్యోగుల జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కాశీనాథ్, మోహన్‌రెడ్డిల ఆధ్వర్యంలో మద్నూర్ శాఖ సర్వసభ్య సమావేశం, నూతన సంఘం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా రామారావు, ప్రధాన కార్యదర్శిగా గంగారాం, ఆర్థిక కార్యదర్శిగా విఠల్, అసోసియేట్ అధ్యక్షుడిగా మనోహర్ పటేల్, ఉపాధ్యక్షులుగా శకుంతల, నాందేవ్, పబ్లిక్ కార్యదర్శిగా శ్రీనివాస్, ఆర్గనైజ్ కార్యదర్శి గంగారాం, జాయింట్ కార్యదర్శిగా యాదవ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు.

యూరియా కోసం బారులు



తాడ్వాయిలో క్యూలో నిలుచున్న రైతులు



నల్లమడుగులో పడిగాపులు కాస్తున్న రైతులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు దేమికలాన్ సింగిల్ విండో కార్యాలయాలలో సోమవారం యూరియా ఎరువులను పంపిణీ చేశారు. యూరియా వచ్చిందని తెలియగానే రైతులు తరలి వచ్చి కార్యాలయాల వద్ద క్యూలో నిలుచొని తీసుకున్నారు. తాడ్వాయిలో 220, దేమికలాన్‌లో 220 సంచుల చొప్పున వచ్చాయి. ఈ ఎరువులు రైతులకు సరిపోలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సరిపడా ఎరువులను సరఫరా చేయాలని రైతులు కోరారు.

లింగంపేట(ఎల్లారెడ్డి): నల్లమడుగు సొసైటీ వద్ద సోమవారం తెల్లవారు జామున 5 గంటల నుంచి యూరియా కోసం రైతులు పడిగాపులు కాశారు. సొసైటీ గోదాంలో 450 బస్తాలు నిల్వ ఉన్నాయి. సొసైటీ పరిధిలోని నల్లమడుగు, మోతె, కొర్పోల్, బాణాపూర్ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో రైతులు తరలివచ్చారు. యూరియా కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. అధికారులు పోలీసుల పహారాలో యూరియా పంపిణీ చేశారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వ వైఫల్యం

భిక్కనూరు: ప్రభుత్వం యూరియా సరఫరాలో పూర్తిగా వైఫల్యం చెందిందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. సోమవారం భిక్కనూరులో ఆయన మాట్లాడారు. రైతులు అష్టకష్టాలు పడుతున్నారని ప్రభుత్వం ఏ మాత్రం స్పందించకపోవడం శోచనీయమన్నారు. పోలీసులతో బెదిరిస్తున్న కాంగ్రెస్ నేతలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పంట నష్టపోయిన రైతులకు రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నేతలు కోడూరి సాయగౌడ్ బ్రహ్మచారి, శ్రీనివాస్, బండి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

రైతులకు నష్టపరిహారం వెంటనే ఇవ్వాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): చెరువులు, కుంటలు తెగిపోయి రైతులకు భారీ నష్టం వాటిల్లిన రైతులకు ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సోమవారం టీడీపీ నాయకులు నాయబ్ తహసీల్దార్‌ను కోరారు. ఈమేరకు వినతిపత్రం అందజేశారు. నాయకులు విశ్వేశ్వర్‌శర్మ, వెంకట్‌రెడ్డి, కృష్ణ, రాములు, సాయిలు, పోచయ్య, తిరుపతి, నాన్యానాయక్, రమేశ్, సాయిలు, నర్సింలు, కాశీరాం పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ

రాజంపేట: భారీ వర్షాలు, వరదల కారణంగా నడిమి తండా, లేత మామిడి తండాలలో నష్టపోయిన కుటుంబాలకు సోమవారం మెదక్ గ్రామానికి చెందిన మహేందర్- లలిత దంపతులు, గతంలో నడిమి తండా గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన దేవలక్ష్మిలు తండా ప్రజలకు నిత్యావసర సరుకులు అందజేశారు. దుప్పట్లు, ఆర్థిక సహాయం అందించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. మాజీ ఉపసర్పంచ్ షేర్ సింగ్, తండా పెద్దలు పాల్గొన్నారు.

భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

భిక్కనూరు: మండల కేంద్రంలో ఇటీవల కురిసి వర్షాలకు నిరాశ్రాయులుగా మారిన 250 కుటుంబాలకు భారతి ఫౌండేషన్ చైర్మన్, న్యాయవాది రాజబాబుగౌడ్ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కామారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద రమేష్ మాట్లాడుతూ..ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రజలకు ఎన్నో సేవ కార్యక్రమాలను చేపడుతున్నారని.. ఇది అభినందనీయమన్నారు. న్యాయవాది అతిమాముల శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణదారులపై ఫిర్యాదు

మాచారెడ్డి: మండలంలోని ఆయా గ్రామాల్లో ఫర్టిలైజర్, విత్తనాలు అమ్ముతున్న ప్రైవేటు ఏజెన్సీలపై సోమవారం బీఆర్ఎస్ నేతలు, కామారెడ్డి ఏడీఏ అపర్ణకు ఫిర్యాదు చేశారు. అధిక ధరలకు అమ్ముతున్న వారి లైసెన్సులు రద్దు చేయాలని కోరారు.

ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి

కామారెడ్డి టౌన్: వరదలతో తీవ్రంగా నష్టపోయి ఇబ్బందులు పడుతున్న ప్రజలనుద్దేశించి ఓవర్ కాన్ఫిడెన్స్ అంటూ మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడిన ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. వరద బాధిత ప్రజలకు కేంద్ర నుంచి ప్రత్యేక నిధులు మంజూరు చేయించి ఆదుకోవాలని కోరారు. నాయకులు వెంకటిగౌడ్, మోతీరాంనాయక్‌లు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతంలో పర్యటన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మంజీర పరివాహక ప్రాంతంలో ముంపునకు గురైన ప్రాంతంలో సోమవారం ఎల్లారెడ్డి ట్రాన్స్‌కో డీఈఈ విజయసారథి పర్యటించారు. ఈ సందర్భంగా వరదల కారణంగా దెబ్బతిన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను, నేలకొరిగిన విద్యుత్‌స్తంభాలను పరిశీలించారు. నష్టంపై అంచనాలు రూపొందిస్తామని ఆయన తెలిపారు. ఏడీఈ నాగేందర్‌రెడ్డి, ఏఈ నాగరాజు, లైన్ ఇన్స్‌పెక్టర్లు సురేందర్, సూర్యా, లైన్‌మన్ నరేష్ ఉన్నారు.